క్లుప్తంగా

అనకాపల్లి డీఐఈవోగా వినోద్‌బాబు



పరవాడ: అనకాపల్లి జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో)గా పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబుకు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) అప్పగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన అనకాపల్లి జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు



దివ్యప్రబంధ పారాయణ చేస్తున్న వైదికులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నాల్గవరోజైన శుక్రవారం పెరియాళ్వార్ తిరునక్షత్రం పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలతోపాటు పెరియాళ్వార్‌ని వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు నాళాయిర దివ్యప్రబంధ పారాయణం చేశారు. విశేష హారతులిచ్చారు.

శత శాతం ఫలితాలే లక్ష్యంగా టీచర్లు పనిచేయాలి



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు తదితరులు

సబ్బవరం: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఫలితాలు సాధించేలా పనిచేయాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టెస్ట్ పాఠ్యాంశాల బోధనను సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై విద్యార్థులను ఆరా తీశారు. ఆయన వెంట స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు సత్యనాయుడు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సురేష్‌బాబు, దాట్ల మధు, మురళి రాజు

పెందుర్తి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను సుజాతనగర్‌లోని 80 అడుగుల రోడ్డులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు దాట్ల మధు, కె.మురళిరాజు, ఎస్.సుబ్బరాజు, ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సురేష్ బాబు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్యోద్యమం పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో దాట్ల రమేష్‌రాజు, దాట్ల సాంబమూర్తి రాజు, పి.శివ పాల్గొన్నారు.

రాంపురంలో టీడీపీ 'తొలి అడుగు'



బ్రోచర్లను అందిస్తున్న గండి బాబ్జి, తదితరులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ సాధించిన విజయాలను ప్రజలు స్వాగతిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. రాంపురంలో 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెన్నెల సన్యాసినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- కునారిల్లుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు
- వాటి పూర్తికి చొరవ చూపని కూటమి ప్రభుత్వం



సొంత భవనం లేక కళామందిరంలో నడుస్తున్న మోటూరువానిపాలెం మినీ అంగన్‌వాడీ సెంటర్



తుప్పల మధ్య మెట్టపాలెం అంగన్‌వాడీ సెంటర్ భవనం



అసంపూర్తిగా నిలిచిపోయిన పాతరాజన్నపాలెం అంగన్‌వాడీ భవనం

పరవాడ మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు పడకేశాయి. దీంతో అరకొర వసతుల మధ్య, అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నెట్టుకొస్తున్నాయి. సరైన సౌకర్యాల్లేకపోవడంతో పిల్లలు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలను ప్రతిపాదించారు. చాలా భవనాల నిర్మాణం శ్లాబ్ వరకు జరిగింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణాలు అర్ధంతంగా నిలిచిపోయాయి.

పరవాడ: మండలంలో సగం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక పాత ప్రభుత్వ పాఠశాలలు, అద్దె భవనాలు, కళా మందిరాలు, సామాజిక భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నాయి. జీవీఎంసీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను మినహాయిస్తే మండలంలో 61 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. వాటిలో 31 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. 30 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే కాలం వెళ్లబుచ్చుతున్నాయి.

మండలంలో సొంత భవనాల్లేని అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సొంత భవన నిర్మాణాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా రావాడ శివారు మోటూరువానిపాలెం, సోమునాయుడుపాలెం, గొల్లగుంట, రేకవానిపాలెం, వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం, వెంకటాపురం, ఇస్సన్నపేట, కలపాక శివారు గొల్లలపాలెం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం, పాతరాజన్నపాలెం, భర్నికం శివారు బాపడుపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో ఒక్కో భవనానికి అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది.



మోటూరువానిపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్ర భవనం

మంజూరైన నిధులతో కాంట్రాక్టర్లు భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తిచేశారు. భవనాలకు ప్లాస్టింగులు, గచ్చులు, తలుపులు, కిటికీలు, విద్యుత్ పనులు చేయాల్సి ఉంది. ఇంతలో ఎన్నికలు రావడంతో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి.

చొరవ చూపని 'కూటమి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికే కూటమి పాలన ఏడాది దాటింది. అసంపూర్తి అంగన్‌వాడీ భవనాలకు మోక్షం కలిగించాలని సిబ్బంది, తల్లిదండ్రులు కోరుతున్నారు. సొంత భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో పిల్లలకు అవసరమైన సరకులు నిల్వ చేయడానికి, బోధనకు ఇబ్బంది పడుతున్నట్లు నిర్వాహకులు చెప్తున్నారు. వీటి పూర్తికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం లేదు. స్వల్ప మొత్తంలో నిధులు కేటాయిస్తే చాలు.. చాలా వరకు నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురావొచ్చు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	61
సొంత భవనాల్లో ఉన్నవి	31
అద్దె భవనాల్లో ఉన్నవి	30
7 నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులు	2044
3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు	413
గర్భిణులు	355
బాలింతలు	249

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల గురించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. ఏయే స్థాయిలో భవన నిర్మాణాలు ఆగిపోయాయి, ఎంత మొత్తం అవసరమో ఆ నివేదికలో పొందుపరిచాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల పనులను పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకొస్తాం.

– లలిత కుమారి, సీడీపీవో, సబ్బవరం

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లో ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్‌ను అదీప్‌రాజ్, శోభా హైమావతి, తదితరులతో కలిసి ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్

- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్
- బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి శ్రీకారం

సబ్బవరం: కూటమి ప్రభుత్వం చేతిలో మోసపోయిన ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీపై ఉందని, కూటమి మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని మాజీ మంత్రి, ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన మండలంలోని ఇరువాడలో శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ టైటిల్ చంద్రబాబుకు అతికినట్లుగా సరిపోతుందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలతో టీడీపీ నాయకులు ఊదరగొట్టారని, వైఎస్సార్‌సీపీ పథకాలనే పేర్లు మార్చి సూపర్ సిక్స్ హామీలుగా పేర్కొన్నారని తెలిపారు. ఇప్పటికే సంక్షేమ పథకాలను ఏడాదిపాటు ఎగవేసి, ప్రజలకు టోపీ పెట్టారని ఆక్షేపించారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకే బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పార్టీ ఓటమిపాలైన ఏడాదిలోనే ఇంత వేగంగా పుంజుకోవడానికి కారణం పార్టీకి ఉన్న బలమైన కార్యకర్తలేనని పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలను క్షేత్ర స్థాయిలో బలంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ముందుగా దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్‌ను, చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడు తూ ప్రజల తరఫున పోరాటమైనా, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమైనా వైఎస్సార్ కుటుంబానికి మాత్రమే సాధ్యమన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన బూటకపు హామీలే కారణమన్నారు. ఇచ్చిన దొంగ హామీలను ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని దుయ్యబట్టారు.

పార్టీ అనకాపల్లి జిల్లా పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలను వంచించిందన్నారు. చంద్రబాబును నమ్మే పరిస్థితి లేకపోవడంతో బాండ్లు, ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించారని పేర్కొన్నారు.

పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కొటాన రాము, రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చిన అప్పలనాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, మండల అధ్యక్షుడు కర్రి బాబు, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీలు పైల సన్యాసిరాజు, ఉప్పిలి కనకరాజు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, స్టూడెంట్ యూనియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి హేమంత్, మహిళా విభాగం నాయకురాలు నదియా తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీగా..



కార్యకర్తలతో బైక్ ర్యాలీగా వస్తున్న గండి రవికుమార్, తదితరులు

ఇరువాడ జీఎస్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి నియోజవర్గ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తలు బైక్‌లపై ర్యాలీగా తరలివచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ ఆధ్వర్యంలో తన స్వగ్రామం మొగలిపురం నుంచి సుమారు 100 బైక్‌లపై కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా సమావేశానికి వచ్చారు.

మణికొండ సూర్యవతికి ఘన నివాళి



సూర్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా కార్యకర్తలు, ప్రిన్సిపాల్ వినోద్‌బాబు

పరవాడ: నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో చురుగ్గా పాల్గొన్న మణికొండ సూర్యవతి వర్ధంతి కార్యక్రమాన్ని ఐద్వా ఆధ్వర్యంలో పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటానికి సూర్యవతి అంకితమైందన్నారు. ఉద్యమానికి మద్దతుగా తన పెళ్లి పట్టు చీరలు సైతం అమ్మేసుకుందన్నారు. మహిళా సంఘాల నిర్మాణం కోసం అనేక విధాలుగా కృషి చేసిందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆమెకున్న 25 సెంట్ల భూమిని మహిళా సంఘానికి దానం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, అధ్యాపకులు లక్ష్మీకాంతం, జయలక్ష్మి, పద్మ, కృషిత, చాందిని, శ్వేత, రోజా, గ్రీష్మ, మౌనిక, అరుణ, భార్గవి, ఇందూ, కుమారి పాల్గొన్నారు.

'దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయండి'



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న సిటు జిల్లా అధ్యక్షుడు లోకనాథం

పరవాడ: లేబర్ కోడ్‌ల రద్దు డిమాండ్‌తో ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిటు అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం పిలుపునిచ్చారు. సమ్మె ప్రచార జాతాను లంకెలపాలెంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేయడంతోపాటు, కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టం, అనేక కార్మిక చట్టాలను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి అమలుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ప్రచార జాత లంకెలపాలెం, పరవాడ, తానాం, తాడి, ఫార్మాసిటీ మీదుగా సాగింది. కార్యక్రమంలో సిటు జిల్లా కార్యదర్శి ఆర్.శంకర్రావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పోతినాయుడు, వెంకటరావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం: ఈనెల 9, 10 తేదీల్లో జరిగే గిరి ప్రదక్షిణ ఉత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి. త్రినాథరావు తెలిపారు. శుక్రవారం సింహగిరిపై ఏఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దర్శన క్యూల ఏర్పాటు పనులను ఆయన పర్యవేక్షించారు. భక్తులకు వేగవంతంగా దర్శనం అయ్యేలా క్యూలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుద్దీపాలంకరణ, నీటి సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేశారు. భక్తులకు స్వచ్ఛంద సంస్థల స్టాళ్లు అడ్డంకి కాకుండా చూసుకోవాలన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేయాలి



సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

- పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి
- సింహాచలం డిపో వద్ద నిరసనలో ఆర్టీసీ సిబ్బంది

సింహాచలం: ఏపీఎస్ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే సొంతంగా కొనుగోలు చేయాలని, ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు కేఎస్ఎస్ మూర్తి డిమాండ్ చేశారు. సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పలు సమస్యలపై ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో పెండిగ్ డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, సర్క్యులర్ 1/2019ను యథావిధిగా అమలయ్యేలా స్పష్టమైన ఆదేశాలు వెంటనే జారీచేయాలని డిమాండ్ చేశారు. టిమ్స్ పరికరాల డ్యామేజీలపై రికవరీలు నిలుపుచేయాలని, డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ నగదును పెంచాలన్నారు. డిప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగుల అంగీకారం మేరకు శాశ్వత బదిలీలు చేయాలన్నారు. ఆర్టీసీ హౌస్‌లో ఉద్యోగులకు అందుబాటులో ఉన్న సీపీఎస్ ఆఫీసును బస్టాండ్‌కు 8 కిలోమీటర్ల దూరంలో తరలించాలన్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. క్లరికల్ సిబ్బంది, సూపర్‌వైజర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన బస్సులు బ్రేక్ డౌన్ అయితే అందుకు గ్యారేజీ సిబ్బందిని బాధ్యుల్ని చేసి అక్రమ చార్జిషీట్లు వేస్తున్నారని, ఆ విధానానికి స్వస్తి పలకాలన్నారు. అన్ని రూట్లను సర్వే చేసి ప్రస్తుత ట్రాఫిక్‌కు అనుగుణంగా రన్నింగ్ టైం పెంచాలని, అక్రమ ఓడీలను రద్దుచేసి సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ ట్రెజరర్ కేఎంఎస్‌పీ స్వామి, సింహాచలం డిపో అధ్యక్షుడు టి.వి.రమణ, సెక్రటరీ నాయుడు, సీనియర్ నాయకుడు రత్నం, గ్యారేజీ సెక్రటరీ రమణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న అమృత గురుకులం విద్యార్థులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తికి వచ్చిన భక్తులచే క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో వారాహి సహస్ర నామావళి హోమం చేశారు. ఈ హోమం ద్వారా దుష్ట గ్రహ ప్రభావం తగ్గుతుందని భక్తుల విశ్వాసం. అమ్మవారికి నవవర్ణ శోభిత పుష్పాలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన జరిపారు. శ్రీవిద్యలో అడ్వాన్స్‌డ్ కోర్సు నేర్చుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చిన 24 మంది అభ్యాసకులకు గురుమాత మంత్ర దీక్షలు ఇచ్చి, కోర్స్‌ను ప్రారంభించారు.

పార్కుల్లో జిమ్‌లకు శ్రీకారం



శంకుస్థాపనలో కార్పొరేటర్ శానాపతి వసంత, తదితరులు

పెందుర్తి: ప్రజల ఆరోగ్యం మెరుగుపరిచే దిశగా కాలనీ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు అన్నారు. శ్రమశక్తినగర్ ఘంటసాల పార్కు, ఏకలవ్యకాలనీ పార్కులో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు కోసం జీవీఎంసీ రూ.18 లక్షల నిధులు మంజూరు చేసింది. ఆయా పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. కాలనీల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: యుక్త వయసులో మద్యం, మాదకద్రవ్యాల వినియోగం వలన జీవితాలు నాశనం అవుతాయని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. చినముషిడివాడ శాంతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'విద్యార్థి భద్రత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టీనేజీలో మంచి-చెడులపై తగిన అవగాహన పెంచుకోవాలన్నారు. మద్యం, డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు బానిసలైతే కుటుంబాలకు కూడా తలవంపులు వస్తాయని చెప్పారు. బాలికలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుని ప్రతి విద్యార్థి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను సీఐ నివృత్తి చేశారు. పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.